# అంటుమొక్క

"మీతో చాలా కష్టం' అన్నది కిరణ్.

అరగంట క్రితమే నాకూ ఆ విషయం అర్థం అయింది. నా వళ్ళో వున్న మనవడి మొహం చూస్తూ నేను సమాధానం చెప్పనే లేదు. కిరణ్‌కు కోపం తీరటం లేదని నాకు తెలుసు. ఆ పిల్ల ఇవ్వాళ కవ్వింపుకు సిద్ధం అయింది.

'ఎవరికి వాళ్ళకి సొంత ఆలోచనలు ఉంటాయి. టేస్ట్ ఉంటుంది. అసలు ఎవరికి వాళ్ళు వాళ్ళు వాళ్ళలాగా ఉండాలనుకొంటారు. మీరయితే అందరినీ మీ ఆలోచనల్లాగా ఉండమంటారు' అన్నది మళ్ళీ.

'తప్పేనంటున్నాను కదా!..." అన్నాను.

'ఇదిగో... అదే... అలా తప్పించుకోకండి. ఇప్పటికైనా కాస్త మా గురించి ఆలోచిస్తే సంతోషం. మీకు ఇంకో కోడలు కూడా రావాలి. కనీసం ఆ వచ్చే అమ్మాయయినా నేను పడ్డ ఇబ్బంది పడకుండా వుంటే చాలు.'

కిరణ్ నా ఎదురుగా నిలబడి నా మొహంలో ఫీలింగ్స్ కోసమో, లేదా ఏదైనా సమాధానం చెపుతాననో ఓ నిముషం చూసి వెళ్ళిపోయింది.

ఇవ్వాళ కిరణ్ నన్ను వదిలిపెట్టదు. ఒక యుద్ధం మొదలయింది. ఇప్పుడు నేను నోరు మూసుకొని వున్నా.... అసలు కారణం నేనే.... ఈ ఫలితం అనుభవించవలసిందీ నేనే!

నావళ్ళో చిన్ని నిద్రపోయాడు. వాడిని ఉయ్యాల్లో పడుకోబెట్టి వరండాలోకి వచ్చాను. పది గంటలు దాటి పోయింది. ఎదురుగ్గా ఖాళీ స్థలంలో పూల మొక్కలు వెన్నెల్లో తడిసి పారవశ్యంలో మునిగినట్లున్నాయి. వరండా చివర స్తంభానికి అనుకొని కూర్చున్నాను. అది నాకిష్టమైన చోటు. కాస్సేపు పాడుకోవాలన్నా, ఏదైనా ఆలోచించుకోవాలనుకొన్నా అక్కడే కూర్చుంటా. నా ఆలోచనలు ఎక్కడికో పరుగు తీస్తున్నాయి.

'కిరణ్ నా కోడలు. ఆ అమ్మాయి నా కొడుకు చేయి పట్టుకొని మా ఇంట్లోకి వచ్చినప్పుడే నా మనసు నిండిపోయింది. కూతుళ్ళు లేని నేను ఆమెను నా చిన్నబిడ్డగానే స్వీకరించాను. కిరణ్ తల్లి పోయాక ఆమె పట్ల నాకెంత జాలి కలిగిందంటే, తను తల్లిలేని బిడ్డ అన్న ఆలోచన ఆమెకు రాకుండా ఆ తల్లి స్థానంలో నేను కూర్చున్నా. తమాషా ఏమిటంటే కిరణ్ నన్ను తల్లిలా ఫీలయిందా అన్నది మాత్రం నేను పట్టించుకోలేదు. బహుశా నా మొదటి తప్పు ఇక్కడ నుంచి ప్రారంభమై వుంటుంది. ఇంక ఆమె గర్భవతిగా వున్నదని తెలిశాక నా ఆనందానికి పట్టపగ్గాలు లేవు. ఆమెను అచ్చం ఒక సన్నజాజి మొగ్గలా నా అరచేతిలో ఉంచుకోవాలనుకొన్నా.

ఒక రాత్రివేళ ఆమెకు నొప్పులొచ్చాయి. సూర్యుని వెలుగుతో పాటే ఒక బుల్లి సభ్యుడు మా ఇంట్లోకి వచ్చేశాడు. నా పెద్ద కొడుకుని కన్నప్పుడు నేనేమని సంతోషించానో, అవ్వాళ నా ఆలోచనలు ఎల్లా ఉన్నాయో నే చెప్పలేను కానీ 'ఇదుగో నీ మనుమడోయ్' అంటూ నా ఫ్రెండ్ డాక్టర్ కవిత బాబుని నాకు అందించినప్పుడు మాత్రం నా ఆనందాన్ని వర్ణించలేను. ఎర్రెర్రని బుల్లి పెదాలతో వాడు నోరు తెరిచినప్పుడల్లా వాడి నోట్లో గ్లూకోజ్ చుక్కలు వేస్తూ, వాడు అరచేతులూ, వళ్ళూ సాగతీసుకొంటుంటే కళ్ళు మూసుకొని మత్తుగా నిద్రపోతున్న కిరణ్ వైపు ఎన్నిసార్లు

చూశాను. ఆ పిల్ల ఇంకా వాడిని చూడలేదే అని బాధ నాకు. నా ఒళ్ళో వున్న పసివాడిని, నా పెద్ద కొడుకు, వాడిని ఆనుకొని కూర్చుని నా చిన్న కొడుకు ఎంతో అపురూపంగా ఏదో వజ్రం దొరికినంత ఆనందంతో చూస్తున్నారు. మా అందరికీ ఇంత ఆనందం ఇచ్చిన కిరణ్ నిశ్చింతగా నిద్రపోతోంది. ఆ నిముషంలో ఆ అమ్మాయి కోసం నా శరీరంలో ఏది కోసి ఇమ్మన్నా అచ్చం శిబి చక్రవర్తిలా సిద్ధపడేదాన్ని. కానీ కిరణ్ కళ్ళు తెరుస్తూనే వేసిన మొదటి ప్రశ్నకు నేను ఉలిక్కిపడి మాటలు రానట్లు అయిపోయాను. 'అయ్యో ఏమిటీ వాడికి తాగిస్తున్నారు. ఆ స్పూన్ గిన్నె ఎక్కడివి... స్టెరిలైజ్ చేశారా?' అన్నది. నేను కంగారు పడ్డమాట వాస్తవం. అవన్నీ నాకు గుర్తు లేవు. డాక్టర్ కవిత తన ఇంట్లోంచి స్పూన్, గిన్నె తెచ్చి ఇచ్చింది. నేనీ కార్యక్రమం మొదలుపెట్టాను. పిల్లల పెంపకంలో నాకు అనుభవం లేదని ఆ నిముషంలో తేల్చేసుకుని వుంటుంది ఆ అమ్మాయి. నాకయితే అంత ఆలోచన రాలేదు. నా రెండు అరచేతుల్లో ఇమిడిపోయిన ఆ పసిగుడ్డు తప్పించి ఈ ప్రపంచంలో నాకు ఇంకేం కనిపించలేదు. కిరణ్‌కు నాకు మధ్య యుద్ధం మొదలైంది. ఆ పసివాడి పెంపకం గురించి మేము పోరులో ఉన్నాం. ప్రతి చిన్న విషయం పెద్ద ఇష్యూ అయ్యేది. వాడికి పోసే నీళ్ళు గోరువెచ్చగా వుండాలని నేనంటే, పనిమనిషి సలహా ప్రకారం తన పిల్లవాడు వేడినీళ్ళతోనే ఆరోగ్యంగా వుంటాడనే అనుభవసారాన్ని కిరణ్ జీర్ణించుకొనేది. వేడి నీళ్ళతో పసివాడి వళ్ళు మాడిపోయేది. నేను నిస్సహాయంగా నిలబడేదాన్ని. నా చేతుల్లోంచి వాడిని రక్షించాలని ఆమె, ఆమె పెంపకం సరిగ్గా లేదని నేనూ నిర్ణయించుకొన్నాం కాబోలు. కన్నీళ్ళతో నా దిండు తడిసేది. బహుశ కిరణ్ కూడా ఏడ్చేదేమో.

కిరణ్ నన్ను అత్తగారి స్థానంలో పరాయిగా చూస్తోందని మొట్టమొదటిసారి నాకు అర్థం అయింది. ఎంత నిస్సహాయంగా ఉండేదంటే చేతగాని కోపంతో నేను అస్తవ్యస్తంగా మాట్లాడేదాన్ని. పిల్లవాడు నా సొంతం అని లాక్కోవాలని అనిపించేది. అంత పోరాటమూ తన బిడ్డకోసం కిరణ్ కూడా చేసేది. ఈ ప్రచ్ఛన్న యుద్ధంలో ఇంటిల్లిపాదీ నలిగిపోయేవారు. ఒక్కోసారి నేనూ, ఒక్కోసారి కిరణ్ గెలుస్తూ వచ్చాం. నేను తనని నొప్పించాలనే ఆలోచిస్తానని, కాకపోతే దానికి మర్యాద ముసుగువేస్తానని కిరణ్ ఇప్పుడు అభియోగం మోపుతోంది. ఇవ్వాళ పొద్దున నేను నూరో తప్పు చేశాను. శిక్ష పడింది నాకు. లైట్లన్నీ తీసేసి కిరణ్ నా పక్కకి వచ్చి కూర్చుంది! నాకు నవ్వు వచ్చింది. నేనెప్పుడూ కిరణ్‌ని ఇక్కడే కూర్చుందామని అడుగుతాను. అయితే ఇక్కడ చల్లనిగాలి వస్తుందని తనకు సైనస్ ప్రాబ్లమ్ ఉందని డైరెక్ట్‌గా ఎప్పుడూచెప్పలేదు కిరణ్. అది నాకు అర్థం కావాలని ఇప్పుడంటోంది ఆ అమ్మాయి.

తను నెమ్మదిగా ఉంటుంది. నాకు మల్లే గలగలా మాట్లాడదు. నా మాటల ప్రవాహంలో ఆమె ఉక్కిరిబిక్కిరి అవుతోందని నా కిష్టం వున్న గజల్స్ తనకి నచ్చకపోవచ్చనీ, నే పాడే పాటలూ, నా గత జీవిత స్మృతులు వినటం తనకు బోర్ కొడుతోందని నాకు తెలియనే లేదు. ఆ అమ్మాయి పాపం నన్ను చాలా భరించింది. తనకు తల్లి లేదు కనుక నా దగ్గర సేఫ్‌గా, అచ్చం వాళ్ళ అమ్మ దగ్గర వున్నట్లే వుంటుందనీ నేను ఆమెకు తల్లిలాగా కనబడతానని నా భావన. కానీ నేను ఆమెకు అత్తగారనే విషయం నాకు గ్రహింపుకు రానే లేదు. కిరణ్‌కు నన్ను చూస్తే గౌరవం మాత్రమే వుంటుందనీ ఆమె నన్ను ఓర్పుతో భరిస్తోందని నాకు అర్థం కాలేదు. ఇవ్వాళ ఆ ఓర్పు హద్దులు దాటిపోయింది.

రాధ ఆమె ఒక్కగానొక్క చెల్లెలు. తను భోపాల్‌లో వుంటుంది. రాధ వచ్చిందని కిరణ్‌ను వెంటనే బయలుదేరి రమ్మని ఆమె తండ్రి ఫోన్ చేశారు. కిరణ్ డెలివరీ అయి సరిగ్గా నెల రోజులు. ఆమె తండ్రి వుండేది పల్లెటూరు. ఆ వూరికి పసిబిడ్డతో ప్రయాణం చేయటం నాకు నచ్చలేదు. కిరణ్ అభిప్రాయం అడగనే లేదు నేను. అంత దూరం కిరణ్ ప్రయాణం చేయలేదని చెప్పేశాను.

తల్లిలేని ఆ అక్కచెల్లెళ్ళు కలిసి పెరిగారని వాళ్ళకి ఒకళ్ళనొకళ్ళు చూసుకోవాలని వుంటుందనీ కిరణ్ తన ఆరోగ్యం కోసం కూడా చూడకుండా చెల్లెలు కోసం ప్రయాణం కడుతుందని నాకు అన్పించలేదు. వాళ్ళ నాన్న ఎంత నిరాశపడి ఫోన్ పెట్టేశారో కిరణ్‌కే అర్థం అయింది. ఆమె బరస్టయి పోయింది. వాళ్ళ పుట్టింటికి ఫోన్ లైన్స్ అంతగా వెళ్ళవు. తను రావాలనుకొంటుందన్న విషయం నిముషాల్లో తండ్రికీ, చెల్లికీ చేరాలనుకొంది. ఇప్పుడీ విషయం ఆయనకు చేరే దారి లేకుండా చేసింది నేనే.

'నేనసలు మనిషినని, నాకు సొంత కోరికలు, అభిప్రాయాలు ఉంటాయని మీకు ఎప్పటికి అర్థం అవుతుంది' అంటూ నిలదీసింది. సమాధానాలు నా దగ్గర అస్సలు లేనే లేవు. ఇంక ఇప్పుడు కిరణ్ మాట్లాడుతోంది. అవి మాటలు కావు. నా పాలిట శూలాలు. నేను తన పట్ల చేసిన అపరాధాలు చెప్పుకు వస్తోంది. కొన్ని నన్ను ఉద్దేశించి కొన్ని తనకు తాను జనాంతికంగా. ఇదంతా హాల్లోంచి నా భర్త, గదిలోంచి నా కొడుకు వింటూనే వున్నారు. ఎన్ని కొత్త విషయాలు చెపుతోందో. వాళ్ళ బెడ్‌రూమ్ అమరిక గురించి కూడా నేనే కలుగజేసుకొంటే ఆవిడకు నోట మాట రాలేదట. రాత్రి వేళ సన్నగా చౌరాసియా వేణుగానం వస్తుంటే తెరచిన కిటికీలోంచి వెన్నెల పడుతోంటే

వాళ్ళ కాపురం ఎంత అద్భుతంగా వుంటుందో నేను ఏర్పాట్లు చేస్తుంటే తనకి నవ్వు ఆగలేదట. ఆ రాత్రివేళ ఆవిడ తలుపులు వేసుకొని వాళ్ళాయన చెవుల్లో కబుర్లు చెప్పుకోవాలని అనుకొనేదట. వాళ్ళ ప్రైవసీలో కూడా నేను వేలు పెట్టడం అన్నది ఎంత హాస్యాస్పదంగా వుందో ఆ అమ్మాయి చెబుతూ ఉంది. వెలుతురు ప్రపంచం మొత్తం పరుచుకొన్నట్లు ప్రతిచోటా నేను ప్రత్యక్షం అయిపోవటం నిజంగా ఎలాటి చిరాకైన విషయం. మొగుడి సంగతి అలా వుంచి, చివరకు పిల్లాడి విషయమూ అంతే. వాడిని నేను నిజంగా ప్రేమిస్తున్నానో, తనతో గొడవ పెట్టుకొనేందుకు వాడిని ఉపయోగిస్తున్నానో తనకు అర్ధం కాలేదట. పసిబిడ్డ విషయంలో ఇద్దరం కలిసి ఆలోచించవచ్చునీ వాడి సంరక్షణా ఆరోగ్యం తమ ఇద్దరికీ ముఖ్యమని నాకు గుర్తు రాలేదట. తాను పిల్లాడికి కన్నతల్లయితే శత్రువులా ఎలా అయిపోయిందో అర్ధం కాలేదని ఆశ్చర్యపోయింది కిరణ్. నా పక్కనే కూర్చుని కళ్ళనీళ్ళు పెట్టుకొంటుంటే కూడా ఓదార్చేందుకు నాకు మాటలు లేనేలేవు. కిరణ్ మాట్లాడిందంతా నిజమేనని నాకు తెలుసు. నేను వేసిన పొరపాటు అడుగుని వెనక్కు తీసుకొనే అవకాశం నాకుందా? నేను మంచి తల్లిని, మంచి టీచర్‌ను, మంచి పొరుగింటామెను. సరే మరి మంచి అత్తగారిని ఎందుకు కాలేకపోయాను. కిరణ్‌ను నేను ఓదార్చలేదు. వెంటనే ఆమె ఊరికి వెళ్ళే ఏర్పాటు చేశాను. పొద్దుటే టాక్సీ పంపించమని ట్రావెల్ ఏజెన్సీకి ఫోన్ చేశాను. తన కోసం ఏదైనా తినేందుకు ఇద్దామని వంటింట్లోకి జొరబడ్డాను. మిక్సీ తిరుగుతున్నా, కూరలు తరుగుతున్నా మెకానికల్‌గా పని అంతా అయిపోతున్నా నా మెదడు చురుకుగా ఆలోచిస్తోంది. నా భర్తతో ఎవరికీ ఇబ్బంది ఉండదు. అతను అచ్చం బంధువులాగా మసలుకొంటాడు. తన పని తాను చేసుకొని వేళకు అన్నం తిని, తన చదువు, తన విశ్రాంతి, తను చేసే పార్ట్‌టైమ్ ఉద్యోగం.. స్నేహితులు బస్... అంతే! అతనికి మిగతా ప్రపంచంతో పని ఉండదు. ఎటొచ్చీ నాతోనే వస్తుంది గొడవ. నేనెక్కడ బోల్తా పడ్డానో అర్ధం అవుతోంది. ఈ ఇల్లు ఇప్పటివరకూ నేను నిర్మించుకున్న బొమ్మరిల్లు. ఇంట్లో ప్రతి వస్తువు నా ఇష్టానికీ, నా అభిరుచులకూ అనుగుణంగా వుంది.

నేను కన్న పిల్లలూ, నా భర్తా, నేనూ అంటే మొత్తం మాకుగా కలిపి మా అందరి అభిరుచులూ కలగలిపి నేనో నిఘంటువు తయారు చేశాను. మా ఇంట్లో అందరం ఆ నిఘంటువులోనే అర్థాలు వెతుకుతూ వుంటాం. ఇప్పుడొచ్చిన ఈ కొత్తమ్మాయి కిరణ్‌కి ఆ నిఘంటువు గురించి తెలియదు. అందులో కొన్ని పదాలకు

అర్థాలే బోధపడకపోవచ్చు. ఆమె నన్ను ఎరగదు. నా మనస్సులో పొంగిపొరలే ప్రేమ నా పిల్లలకు అర్థం అయినట్లు కిరణ్‌కు ఎలా అర్థం అవుతుందీ. మా అమ్మ మా కోసం, మా క్షేమం కోసం అన్న నమ్మకం నా పిల్లలకు ఇవ్వగలిగాను. వాళ్ళు కళ్ళు తెరిచి మొదట ప్రపంచాన్ని చూడటం మొదలుపెట్టాక వాళ్ళు నన్నే గుర్తు పట్టారు. వాళ్ళకు అమ్మ స్పర్శ పుట్టుకనుంచే తెలుసు. మరి కిరణ్. ఆమెకు నేను ఎలా అర్థం అయి వుంటాను. ఆమె అభిప్రాయాలు తెలుసుకోకుండా నేను చేసినదేమిటి? నా ఇష్టాలు ఆమెపై బలవంతంగా రుద్దటం కాదూ? ఈ కొత్త వాతావరణంలో ఆమె ఎంతో అభిమానంతో మాతో కలిసి జీవించేందుకు వచ్చింది. తనకు ఇవన్నీ పరిచయం చేశానా? మా ఇష్టాలే నిండి వున్న ఈ ఇంట్లో నేను కిరణ్‌కు ఇచ్చిన చోటెంత.

నా పెద్దరికంతో ఆ అమ్మాయిని ఎంత ఇబ్బంది పెట్టి వుంటానో తలుచుకొంటేనే నాకు నాపైన చాలా చిరాకొచ్చింది. ఈ ప్రపంచంలో మనుష్యులను అర్థం చేసుకోవటం ఎంత కష్టం. అదేదో నాకు సహజమైన హక్కులాగా ఆ అమ్మాయిని నా కబుర్లతో నా సొంత టేస్ట్ పేరుతో, ఎంత వేధించానో, నేను ఇప్పుడు అర్థం చేసుకొన్నానని ఇదంతా కిరణ్‌కి ఎలా చెబితే అర్థం అవుతుందీ?

తెల్లవారే సరికి చిన్నబాబుని తీసుకొని కిరణ్ పుట్టింటికి వెళ్ళిపోయింది. వెళ్ళే ముందరే నాతో గంటసేపు మాట్లాడింది. నాపైన కోపం తెచ్చుకొన్నందుకు ఆ అమ్మాయికి సిగ్గు వేసిందట. ఈ మాట ఆ అమ్మాయి చెప్పింది కానీ నేను చెప్పనందుకు, ఇక్కడా హిపోక్రసీ ముసుగు వేసుకొన్నందుకు మళ్ళీ నాపైన నాకు కోపం వచ్చింది.

ఆమెను అలా పంపేసి నేను చేసిన పని ముందుగా ఇంటికి తాళం వేసి కొత్త ఇల్లు వెతికేందుకు బయలుదేరటం. కిరణ్ వచ్చేసరికి తన కోసం రెండు మూడు ఇళ్ళు చూడాలి. ఇప్పుడు కిరణ్ ఇష్టంలోంచి వాళ్ళ ఇల్లు రూపం దిద్దుకోవాలి. నాకందులో చోటుంటుందా లేదా అవన్నీ తరువాత. ముందస్తుగా ఆమె అభిప్రాయాలు, ఇష్టాలు గమనించటం నా కర్తవ్యం. ఇప్పటివరకూ ఆ పిల్ల వెనకాలే ఎంత నసపెడుతూ తిరిగానో, ఎంత విసిగించి వుంటానో తలుచుకొంటే నాపైన నాకే కోపం వచ్చింది. ప్రేమించటం అంటే ఆమెను వెంటాడి వేధించటం కాదు కదా.

కిరణ్ ఇప్పుడు చిన్న మొక్క. ఒక్కో ఆకూ వేస్తూ ఆమె కొమ్మలూ, రెమ్మలతో విస్తరిస్తుంది. రేపటి ఆ వృక్షం నీడన నేను సేద దీరాలనుకొంటే ఆ ఎదుగుదలకు నేను సాయం చేయటం ఒక్కటే కర్తవ్యం. నా కొడుకూ, కోడలూ ఎదిగే మొక్కలనుకొంటే నేను తోటమాలిని కాలేనా? ❊

*'ఆంధ్రప్రదేశ్' నవంబరు, 2001*